
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 జులై 2025
5
తిరుపతి



గుండెపోటుతో రుయా వైద్యుడు మృతి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ
హార్ట్ ఎటాక్‌తో రుయా వైద్యుడు మృతి చెందిన ఘటన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పేద రోగులకి చికిత్స అందించేందుకు హడావిడిగా వెళుతున్న ఓ ప్రొఫెసర్ ఉన్నపళంగా నడిరోడ్డుపై కుప్పకూలి పడిపోయాడు. వివరాల్లోకి వెళితే... అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన డాక్టర్ నరేంద్ర (53) తిరుపతి రుయా ఆసుపత్రి జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. డాక్టర్ నరేంద్ర భార్య ఇద్దరు పిల్లలు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. రుయా ఆసుపత్రికి బదిలీపై వచ్చారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం రుయా అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట నడుచుకుంటూ వెళుతుండగా ప్రొఫెసర్‌కు హార్ట్ స్ట్రోక్ రావడంతో ఉన్నఫలంగా కుప్పకూలిపోయారు. ఆస్పత్రి సిబ్బంది హుటాహుటిన ఆయన్ని రుయా అత్యవసర వార్డుకు తరలించి, సి పి ఆర్ నిర్వహించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్ కు తరలించారు. స్విమ్స్ లో వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రొఫెసర్ నరేంద్ర మృతదేహానికి పలువురు వైద్యులు, సిబ్బంది నివాళులర్పించారు.



సగానికి పైగా భర్తీకాని పోస్టులు
పని ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు

టిటిడి ఇంజినీరింగ్ శాఖ ఖాళీ..!

ప్రజాశక్తి-తిరుపతి సిటీ
నిత్యం లక్షలాది మందికి సేవలందించే టిటిడిలో కొత్త నియామకాలు కరువయ్యాయి. ఉన్నవారు రిటైర్డు అవుతున్నా భర్తీ కోసం యాజమాన్యం పట్టించుకోకపోవడం శోచనీయం. టిటిడి ఇంజనీరింగ్ శాఖలో మరీ దారుణం. ఇలాగే కొనసాగితే 2030 మార్చి కల్లా ఆ శాఖ పూర్తిగా ఖాళీ అయ్యే ప్రమాదం లేకపోలేదు. ఇంజనీర్ల కొరత కారణంగా నిర్మాణపనులు ఆలస్యమవుతున్నా పట్టించుకునే నాధుడే లేడు. అధికారుల కొరత కారణంగా కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని సమాచారం.

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ప్రపంచంలోనే పేరుగాంచిన అతిపెద్ద ఆధ్యాత్మిక క్షేత్రం. ఆర్థిక పరిపుష్టి గల స్వయం ప్రతిపత్తిగల సంస్థ. ప్రతి రోజూ లక్ష మందికిపైగా భక్తులకు స్వామివారి దర్శనం, వసతి, రవాణా సౌకర్యం, భోజన సదుపాయాలతో పాటు ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తోంది. ముగ్గురు ఐఏఎస్‌లు, ఐపిఎస్‌తో పాటు వందలాది మంది ఉన్నతాధికారులు, వేలాది మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్న వ్యవస్థ. ఇలాంటి సంస్థ కూడా యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తరుచు విమర్శలు పాలవుతోంది. ఏళ్ల తరబడి కొత్త నియామకాలు నోచుకోకపోవడం శోచనీయం. కొత్త భవనాలు నిర్మాణం, నిత్యం అవసరమయ్యే విద్యుత్, రహదారుల నిర్మాణం, సంక్షేమ సౌకర్యాల కల్పనకు కీలకమైన ఇంజనీరింగ్ శాఖ పరిస్థితి మరీ దారుణం. ఒక చీఫ్ ఇంజనీరు, సివిల్‌లో ముగ్గురు సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 16 మంది, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు -73, స్తపతి ఒకరు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు -74, అసిస్టెంట్ ఇంజనీర్లు 75, అసిస్టెంట్ స్తపతులు 12, ఎలక్ట్రికల్ ఆఫీసర్లు 17, అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఆఫీసర్లు 63, శిల్పి డ్రాఫ్ట్‌మెన్ ఒకరు, ఎలక్ట్రికల్, ఆర్‌అండ్‌బి ఇంజనీరింగ్ శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఒకరు, డివిజనల్ ఇంజనీర్లు 03, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 17, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 12, అసిస్టెంట్ ఇంజనీర్లు 29, టెక్నీషియన్స్ 06, అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఆఫీసర్లు 15 మంది, మొత్తం 419 మంది అధికారులు అవసరం. ఇది 2025 మార్చి వరకే. ప్రస్తుతం 2025 జూన్ లెక్కల ప్రకారం కేవలం 237 మంది అధికారులు మాత్రమే ఉన్నారు. అంటే సగానికిపైగా అధికారుల కొరత ఉంది. సిఈ, ఎస్ఇ, ఈఈ, డిప్యూటీ ఈఈ, స్తపతి, ఎలక్ట్రికల్‌లో ఎస్ఇ, డిఈ, డిఈఈ, పదవులు సీనియార్టీ కింద ఉద్యోగోన్నతులతో భర్తీ చేస్తారు. మిగిలిన పోస్టులు డైరెక్టు, పదోన్నతులు నిర్దేశిత నిష్పత్తుల ప్రకారం భర్తీ ఉంటుంది. కాని దశాబ్దం పైగా కొత్త నియామకాలు చేపట్టలేదు. పైగా ప్రతి ఏడాది 30 నుంచి 40మంది ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఈ లెక్కన 2030 ఏడాదికి ఇంజనీరింగ్ సెక్షన్లో కేవలం పదుల సంఖ్యలో మాత్రమే అధికారులు ఉండనున్నారు. దీంతో ఆ శాఖ పూర్తిగా ఖాళీ అవబోతోంది. ఇప్పటికే డిఈఈ లు 14 మందికి ఈఈలుగా, 39 ఏఈలకు డిప్యూటీ ఈఈలుగా పదోన్నతి ఇవ్వాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. సూపరింటెండెంట్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అధిక భాగం ఇన్‌ఛార్జిల పాలన జరిగేలా ఇంజనీర్లు సైతం సగానికి సగం ఖాళీగా ఉండటంతో పలు సెక్షన్లకు ఇన్‌ఛార్జీలు తప్పడం లేదు. 2010లో చివరి సారిగా ఇంజనీర్ల భర్తీ కాస్తో, కూస్తో జరిగిన ఆ తర్వాత లేదు, 2023లో నోటిఫికేషన్ ఇచ్చినా, దరఖాస్తుల స్వీకరణ పరిమితం చేశారు. ఆ తర్వాత దాన్ని పట్టించుకున్న నాధుడు లేడు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు టిటిడి కార్యాలయాలు పని చేస్తుంటే అధిక భాగం ఇన్‌ఛార్జీల పాలనతో నెట్టుకురావాల్సి వస్తుంది. దీని వల్ల పలు నిర్మాణ పనులు నిర్దేశిత సమయానికంటే ఆలస్యమవుతున్నాయి. కాంట్రాక్టర్లు నిర్మాణాలు పూర్తి చేసిన కనీసం అసిస్టెంట్ ఇంజనీర్లు ఎంబుక్ (మెజర్‌మెంట్ బుక్) సకాలంలో రాసే పరిస్థితి కూడా లేదు. దీని వల్ల ఎంబుక్ కోసమే కాంట్రాక్టర్లు నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఆ పైపై మార్పిడి, కింద స్థాయి నుంచి పై స్థాయి వరకు అధికారుల పరిశీలన, నిధులు విడుదల నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా టిటిడి యాజమాన్యం స్పందించి, ఇంజనీరింగ్ శాఖలో ఉన్న ఖాళీలను పదోన్నతులు, డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయకపోతే భవిష్యత్తులో టిటిడిలో ఇంజనీర్లు ఉండేవారంటూ అనే పరిస్థితి దాపురించే అవకాశం ఉంది. టిటిడి యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకుని, అటు సిబ్బంది పని ఒత్తిడిని తగ్గించి, ఇటు నిరుద్యోగులకు అవకాశాలు ఇచ్చి ఆదుకుంటుందని ఆశిద్దాం.



తిరుమలలో 'బిగ్ క్యాంటీన్ టెండర్లు'

పరిశీలన పేరుతో గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి -తిరుమల
తిరుమలలో ఐదు బిగ్ క్యాంటీన్ టెండర్లను సోమవారం ఉదయం 12 గంటలకు తెరిచారు. రెవెన్యూ యంత్రాంగం మొత్తం ఈ టెండర్ల ప్రక్రియను పరిశీలించారు. ఐదు పెద్ద హోటళ్లకు దాదాపు 149 మంది టెండర్ దారులు పాల్గొన్నారు. ఇందులో రాయల్ సారంగి హోటల్ 26 మంది టెండర్ లు వేయగా స్క్రూట్నీ పేరుతో గంటల తరబడి టెండర్ దారులు నిరీక్షించి విసుగుపోయారు. తిరుమలకు విచ్చేసే భక్తులకు మంచి ఆహార పదార్థాలు అందివ్వాలనే ఆలోచనతో టిటిడి దేశ వ్యాప్తంగా పేరుమోసిన హోటళ్లను టెండర్లలో పాల్గొనాలని కోరారు. అయితే ఇందులో టిటిడి అనుకొన్నదొకటి ఐనదొకటి అన్న చందాన అధిక మొత్తంలో పేరు కూడా వినపడని హోస్పిటాలిటీ, క్యాటర్స్ అధికంగా పాల్గొన్నారు. ఏకంగా బిర్యానీ జోన్ పేరుతో ఉన్న క్యాటర్స్ కూడా పాల్గొనడం విస్తు పోయిన అధికారులు విస్తుపోయారు. సాయంత్రం 7 గంటల వరకు వచ్చిన సమాచారం మేరకు 10 అప్లికేషన్లు స్క్రూట్నీ చేసినట్లు తెలిసింది. టెండర్ల ప్రక్రియ ముందుగానే చెక్ లిస్ట్ ప్రకారం టెండరు దారులు వేసిన టిటిడి పెట్టిన టర్మ్స్ అండ్ కండీషన్ లకు ఒక్కో అప్లికేషన్ బండిల్...బండిల్ గా వచ్చి పడ్డాయి. వీటిని పరిశీలించి మరింత సమయం పడుతుందని సిబ్బంది చర్చించుకుంటున్నారు. మరో వైపు ఈ నెల 30న జనతా క్యాంటీన్ లు టెండర్లు కూడా తెరవాల్సి ఉంది. ఈ టెండర్లు పారదర్శకంగా జరుగుతాయా అని చర్చ జరుగుతోంది. ఈ టెండర్ల పరిశీలనలో ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ వెంకటయ్య, టాస్క్ ఫోర్స్ ఏ.ఈ.ఓ శివాజీ, ఈ.ఈ 5 వేణుగోపాల్ పాల్గొన్నారు.



టిటిడిలో దళిత ఉద్యోగుల సస్పెన్షన్ రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
తిరుమల తిరుపతి దేవస్థానంలో దళితులకు ఆదినుంచి హిందూయేతరులనే పేరుతో ఉద్యోగులపైన వేధింపులతో పాటు, సస్పెండ్ చేయడాన్ని దళిత, అఖిలపక్ష ప్రజాసంఘాలు ఖండించాయి. ఈ చర్య రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డాయి. తిరుపతిలో సిపిఎం, ఆర్‌పిఐ, విసికె, సిపిఐ(ఎంఎల్) డెమోక్రసీ, అంబేద్కర్, షెడ్యూల్ కులాల సంక్షేమ, అంబేద్కర్ ఆర్మీ, భారతీయ దళిత సాహిత్య అకాడమీ, జైభీమ్, సమత సైనిక్ దళ్ సోమవారం సాయంత్రం రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం రాజ్యాంగ పరిధిలో ఉన్నప్పటికీ దళిత ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. అవకాశాల్లో ఎక్కడ కోత పడతాయోననే కారణంగానే ముగ్గురు నర్సులను, ఎఇఒ స్థాయి అధికారిని సస్పెండ్ చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సస్పెండ్ అయిన దళిత ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిటిడిలో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు సమాన అవకాశాలు కల్పించాలని, హిందూయేతరులనే పేరుతో రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. వేధింపులు ఇలాగే కొనసాగితే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ పరిపాలనా భవనం ఎదుట వేలాదిమందితో ఉద్యమిస్తామన్నారు.

ఈ చర్చాగోష్టి కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, అఖిలపక్షం నాయకులు పరమశివం, నాగేశ్వరరావు, వి.నాగరాజు, పి.అంజయ్య, బోకాం రమేష్, పి.ప్రభాకర్, పి.వెంకటరత్నం, జి.ధనశేఖర్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల తొలగింపు కుట్ర

- ఎఫ్ఆర్ఎస్ టార్గెట్లు...సిడిపిఒల ఒత్తిళ్లు
- నెట్‌వర్కు పనిచేయక అంగన్‌వాడీల ఫీట్లు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ (ముఖ ఆధారిత గుర్తింపు) అంగన్‌వాడీలకు ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్కు పనిచేయకపోవడంతో ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తికావడం లేదన్నది అంగన్‌వాడీల ఆవేదన. అయితే ఖచ్చితంగా ఆన్‌లైన్ చేయాల్సిందేనని సిడిపిఒలు అంగన్‌వాడీల మెడపై కత్తి పెట్టి ఒత్తిడి చేస్తున్నారన్న విమర్శలున్నాయి. 'గర్భిణులు, బాలింతలు, ఆర్నెళ్ల నుంచి మూడేళ్ల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోం రేషన్' సేవలు పొందాలని షరతు పెట్టారు. అంగన్‌వాడీల మొబైల్ ఫోన్ ద్వారా మంత్రిత్వ శాఖ 'పోషణ్ యాప్'లో లబ్ధిదారుల ముఖ గుర్తింపు వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలి. ఎఫ్ఆర్ఎస్ రిజిష్టర్ కాని వారికి టేక్ హోం రేషన్ ఇవ్వబోరని ఆదేశాలున్నాయి. ఈ ఎఫ్ఆర్ఎస్ అంతా లబ్ధిదారుల తొలగింపు కుట్రలో భాగమేనని అంగన్‌వాడీ యూనియన్లు మండిపడుతున్నాయి. ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామన్న బెదిరింపులు ఉంటున్నాయి.

ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 24 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 4,192 కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ప్రీస్కూల్ 3 నుంచి ఐదేళ్ల పిల్లలు ప్రస్తుతం 82,809 మంది ఉన్నారు. తిరుపతి జిల్లాలో 2,731 మంది అంగన్‌వాడీలు ఉన్నారు. మినీ వర్కర్లు 345 మంది ఉన్నారు. హెల్పర్లు 2,076 మంది ఉన్నారు. గర్భిణులు 7,986మంది, బాలింతలు 6,621 మంది లబ్ధి పొందుతున్నారు. ఆరు నెలల క్రితం ఎఫ్ఆర్ఎస్ పూర్తి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రకారమే గర్భిణులు, బాలింతలు, ఆర్నెళ్ల నుంచి మూడేళ్ల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోం రేషన్ సేవలు పొందాలని షరతు విధించింది. ఎఫ్ఆర్ఎస్ రిజిష్టర్ కాని వారికి రేషన్ ఇవ్వబోరని స్పష్టం చేసింది. ఐసిడిఎస్ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారుల్లో ఎఫ్ఆర్ఎస్ పూర్తి కాని వారిని రద్దు చేయాలని సిడిపిఒల ఆదేశాలు. లేకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హుకుం జారీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ పూర్తి కాని వారిని తొలగిస్తే అంగన్‌వాడీ వర్కర్లపై లబ్ధిదారులు గొడవకు దిగే అవకాశాలు ఉన్నాయి. ఎఫ్ఆర్ఎస్ అయినా పూర్తి చేయాలని, లేకుంటే లబ్ధిదారులనైనా తొలగించాలని అంగన్‌వాడీలపై తీవ్ర ఒత్తిడి ఉంది.

ఎఫ్ఆర్ఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ



ఎఫ్ ఆర్ ఎస్ వెంటనే రద్దు చేయాలి. ఈ పద్ధతి పెట్టడం వల్ల అంగన్వాడి సిబ్బందితోపాటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడి సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ట్యాబ్లు, ఫోన్ సౌకర్యం కల్పించాలి. ఎఫ్ఎస్ఆర్ వల్ల మారుమూల గ్రామాల్లో నెట్‌వర్కు సరిగా పనిచేయక ఇబ్బందులకు గురి అవుతున్నాం. ఓటిపిలు సక్రమంగా రాకపోవడంతో లబ్ధిదారులు తమపై కోపం చేసుకుంటున్నారు. అన్నింటికి కలిపి ఒకే యాప్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఎఫ్ఆర్ఎస్ లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ రెండు దశల్లో చేపట్టాలి. తొలుత మొబైల్లో లబ్ధిదారుల ఫొటో తీయాలి. రెండోది లబ్ధిదారుని ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ఒటిపిని వెరిఫై చేయాలి. దీనిలో విఫలమైతే లబ్ధిదారులను జాబితా నుంచి తొలగిస్తారు. అటువంటి వారికి టేక్ హోం రేషన్ ఇవ్వొద్దని ఆదేశాలు ఉన్నాయి. గ్రామాల్లో ఎఫ్ఆర్ఎస్ పూర్తి కాని లబ్ధిదారులు అంగన్‌వాడీ వర్కర్లతో గొడవకు దిగుతున్నారు. ఈ ఎఫ్ఆర్ఎస్ అనేది ఆహార భద్రత చట్ట ఉల్లంఘనే. దీన్ని రద్దు చేయకపోతే పోరాటం తప్పదు.

ఊరికి దూరంగా.. 'రియల్టర్లకు' దగ్గరగా..!



రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు మార్పు

ప్రజాశక్తి - రేణిగుంట
తిరుపతి జిల్లా పరిధిలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రేణిగుంట సబ్ రిజిస్టర్ ఆఫీస్ కార్యాలయం మార్పు ఇప్పుడు పెద్ద చర్చగా మారింది.. రేణిగుంట నడిబొడ్డున ఉన్నటువంటి ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ప్రజలకు, క్రయ, విక్రయదారులు లావాదేవీలు జరుపుకోవడానికి అసౌకర్యంగా, ఇరుకుగా ఉన్నందున ఈ కార్యాలయాన్ని ఓ పెద్ద భవనంలోకి మార్చాలని గత కొంతకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి..ఇదే అంశాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలని గతంలో ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్టార్ ఒకరు..పావులు కదిపినట్టు సమాచారం.. తమకు కావలసిన వ్యక్తి చేత అగమేఘాల్లో ఊరికి దూరంగా రేణిగుంట చెక్ పోస్ట్ సమీపంలో.. లే ఔట్ నందు హడావిడిగా ఓ భవనాన్ని కట్టించి..అధిక మొత్తంలో అద్దె చెల్లించే విధంగా ప్లాన్ చేశారు. ఈ విషయాన్ని గ్రహించిన పై అధికారులు అప్పటి సబ్ రిజిస్ట్రార్ వేసిన పథకం పారకుండా అడ్డుకట్ట వేశారు. మళ్ళీ తిరిగి ఆ..ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి..

ప్రజలకు ఏమాత్రం సౌకర్యంగా లేని ప్రాంతాన్ని నూతన కార్యాలయం కొరకు ఎంపిక చేయడం వెనుక రహస్యం దాగి ఉంది.. తిరుపతి రూరల్, తిరుచానూర్, పద్మావతి పురం, శ్రీనివాస పురం.. మంగళం, ఆటోనగర్, దామినేడు తూకివాకం కరకంబాడి ప్రాంతాల పరిధిలో ఉన్న భూములు రేణిగుంట సబ్ రిజిస్టర్ ఆఫీస్ పరిధిలోకి వస్తాయి.. ఇప్పటికే ప్రజలు రేణిగుంట కార్యాలయం కు రావడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు.. ఇలాంటి సమయంలో ఊరికి తూర్పు వైపు జన సంచారం లేని ప్రాంతంలో.. కనీసం ఆటోలు ఇతర రవాణా వాహనాలు కూడా అందుబాటులో ఉండవు.. మరో ముఖ్య విషయం ఏమిటంటే రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ, ఇతర చలానాలు కట్టాలి అంటే బ్యాంకు కూడా చాలా దూరమైపోతుంది.. అసలు ఈ కార్యాలయాన్ని మార్చడం వెనుక ఒక వ్యక్తి స్వప్రయోజనం దాగి ఉందన్న ప్రచారం జరుగుతుంది. నూతనంగా ప్రతిపాదించిన ఈ కార్యాలయం దగ్గరలోనే రైల్వే డీజిల్ ట్యాంకర్లు కూడా ఉన్నాయని..ఏదైనా ప్రమాదం జరిగితే ఆఫీసులోని రికార్డులు, ఇతర ముఖ్యమైన పత్రాలకు భద్రత ఉండదన్న వాదన కూడా ఉంది. అధిక మొత్తంలో అద్దె చెల్లించడం కోసం..అభివృద్ధి లేని ప్రాంతాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు పేరుతో ఎంపిక చేయడం వెనుక భారీ స్కెచ్ ఉంది.. ఈ ఆఫీసును చూపించి చుట్టు పక్కల ప్లాట్లను ఎక్కువ ధరలకు అమ్ముకోవాలని, అక్కడ గదులను డాక్యుమెంట్ రైటర్లకు అధిక మొత్తంలో అద్దె లకు ఇచ్చి వేలకు వేలు వసూలు చేయాలనుకోవడమే లక్ష్యం గా కనిపిస్తోంది. వీటన్నిటి వెనుక ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారం దాగి ఉందని కూడా తెలుస్తోంది. ఎవరి ప్రయోజనం కోసం ఈ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ను ఊరికి దూరంగా ఏర్పాటు చేస్తున్నారో పెద్దలకే తెలియాలి.. ఇప్పటికే ఈ కార్యాలయం మార్పు ఈ ప్రతిపాదనను పై అధికారులు కొంత వ్యతిరేకించినట్టుగా తెలుస్తుంది.. డాక్యుమెంట్ రైటర్లు, పట్టణ ప్రముఖులూ ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు.. జనం కు అందుబాటులో ఉండే ప్రాంతంలోనే సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.. గతంలో ఊరు మధ్యలో ఉన్నటువంటి తహ సిల్దార్ కార్యాలయం తీసుకొని వెళ్లి ఎక్కడో దూరంగా ఉంచడంతో అక్కడికి వెళ్లి రావడానికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.. ఇప్పుడు ఎంతో కీలకమైనటువంటి సబ్ రిజిస్టర్ ఆఫీసును తీసుకెళ్లి దూరంగా పెట్టడం వలన ప్రజలకు మరింత అసౌకర్యం ఏర్పడే అవకాశం ఉంది..ఉన్నతాధికారులు మరోసారి పునరాలోచించి అందరికీ ఆమోదయోగ్యమై సౌకర్యమైన ప్రాంతాన్ని ఎంపిక చేసి సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని అందులోకి మార్చాల్సిన అవసరం ఉంది.! నియోజకవర్గ ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చొద్దు : సిపిఎం

రేణిగుంట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయము పట్టణంలో ఉండాలే తప్ప ఊరికి బయట మార్చవద్దని సిపిఎం మండల కార్యదర్శి హరినాథ్ ప్రకటనలో డిమాండ్ చేశారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని రేణిగుంట చెక్‌పోస్ట్ వద్దకు మారుస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని, దీనివల్ల క్రయవిక్రయాలు చేసుకునే సామాన్య మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది కలుగుతుందన్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగే అవినీతి ఎక్కడ బయటపడుతుందోననే భయంతోనే ఊరికి బయట సబ్ స్టేషన్ కార్యాలయం పెట్టడం మంచిది కాదన్నారు. ఇప్పటికే రేణుగుంట తాసిల్దార్ కార్యాలయం ఊరి బయట పెట్టడం వల్ల రేణుగుంట మండల వాసులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని గుర్తు చేశారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మరింత అవినీతి జరిగే అవకాశం ఉందని, పట్టణంలోనే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉండాలని కోరారు

స్కిట్‌కు పునరుజ్జీవం

రెండో కౌన్సిలింగ్ ఆన్‌లైన్‌లో



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి
శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు మళ్లీ ప్రాణం వచ్చింది. ఈ ఏడాది నుంచి తిరిగి ప్రారంభించడానికి జెఎన్టియు అంగీకరించింది. అనంతపురంలోని జెఎన్టియు విభాగం కళాశాల నిర్వహణ చేపట్టింది. సీఎస్ఈ, సిఎస్సి, సిఎస్ఎం, ఈసీఈ, ఈఈఈ విభాగాలు ఉంటాయని జెఎన్టియు ప్రకటించింది. ఒక్కో విభాగంలో 66 మంది విద్యార్థులను చేర్చుకుంటామని, 70 వేల రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ప్రకటించారు. అడ్మిషన్ల కోసం వెబ్సైట్లో సోమవారం పొందుపరిచారు. 1997లో దేవస్తానం ఆధ్వర్యంలో ప్రారంభించబడిన స్కిట్ కళాశాల రాష్ట్రస్థాయిలో ప్రసిద్ధి చెందింది. అయితే కులరాజకీయాల కారణంగా అడ్మిషన్లు పూర్తిగా తగ్గిపోయాయన్న విమర్శలు ఎదుర్కొని 2020లో మూతపడింది. కళాశాలను తిరిగి తెరిపిస్తామని వైసిపి ప్రభుత్వం ప్రకటించింది. అయితే అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం వస్తూనే స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్కిట్ కళాశాల తెరిపించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉన్నత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో పలుసార్లు సమావేశమయ్యారు. కళాశాలను జేఎన్టీయూ స్వాధీనం చేసుకుంది. ఈ ఏడాది రెండో విడత అడ్మిషన్లకు అనుమతి లభించింది. గతంలో జరిగిన తప్పులను సమీక్షించుకుని కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. స్కిట్‌కు పునరుజ్జీవం కల్పించిన ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డిని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు, గుమ్మిడిపూడి దశరథ ఆచారి, మిన్నల్ రవి, బాలాజీ రెడ్డి పాల్గొన్నారు.

ఐఐటి లో ఓరియంటేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -ఏర్పేడు
ఏర్పేడు సమీపంలో ఉన్న ఐఐటి తిరుపతిలో ఈ ఏడాదిలో చేరిన 254 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సంస్థ సంస్కతి, విద్యా చట్రం, సౌకర్యాలతో పరిచయం చేస్తూ ఐఐటీ సంస్థ సోమవారం యువంతర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో ఐఐటి డైరెక్టర్ కే ఎన్. సత్యనారాయణ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ సంస్థ సాధించిన విజయాల అవలోకాన్ని, దాన్ని బలాలను హైలెట్ చేశారు. విద్యా వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ రామకష్ణ గోర్తి విద్యా శాసనాలు, నిబంధనలను వివరించారు. అలాగే విద్యార్థుల అంచనాలు, అవసరాలను అర్థం చేసుకునేలా వ్యవహరించారు. విద్యార్థి వ్యవహారాల డీన్, ప్రొఫెసర్ ఎం.ఎన్ మూర్తి కళాశాల జీవితం, విద్యార్థుల సౌకర్యాలు, ఐఐటీలో ఉన్న పాఠ్యేతర అవకాశాలపై వివరించారు.



టిటిడి పాఠశాలల్లో విద్యార్థులకు 'సద్గమయ' శిక్షణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి
తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సద్గమయ శిక్షణ కార్యక్రమం తిరుపతి, తిరుమలలోని టిటిడికి చెందిన ఏడు పాఠశాలల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సద్గమయ కార్యక్రమంలో విద్యార్థులకు భక్తి భావం, భగవద్గీత పరిచయం, మానవీయ కోణం, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, క్విజ్, సింహావలోకనం, విద్యార్థులలో సజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, వాస్తవ ప్రపంచాన్ని అధ్యయనం చేయడం, వ్యక్తిగత పురోగతి, సమాజంలో భాగస్వామ్యం, నైపుణ్యాలు, మన సంస్కృతి - సాంప్రదాయాలు తదితర అంశాలపై విశ్లేషనాత్మకంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 31వ తేదీ చివరి రోజు శిక్షణ అనంతరం విద్యార్థులకు సంబంధిత అంశాలపై పుస్తక ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్.జి.ఎస్. హైస్కూల్ కార్యక్రమంలో డిపిపి కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, డిఈవో వెంకట సునీల్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో రాజమాణిక్యంను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి. రాజ మాణిక్యంను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు అక్బర్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డి డి ఈ పి జి పరీక్షలు ఏప్రిల్ లో జరిగాయని, ఫలితాల కోసం డీఎస్సీ రాసినటువంటి అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని, ఈ ఫలితాలు విడుదల చేయమని గత నెల రోజులుగా కొంతమంది డీఎస్సీ అభ్యర్థులు విశ్వవిద్యాలయ పరిపాలన భవనం చుట్టూ తిరుగుతూ ఉన్నప్పటికీ నాలుగైదు సార్లు ఫలితాల ఆలస్యం గురించి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ మాణిక్యం దృష్టికి తీసుకుని వెళ్లిన డీఎస్సీ అభ్యర్థుల పట్ల చిన్న చూపు చూస్తూ, లెక్క లేకుండా మాట్లాడుతూ బాధ్యతారహితంగా ప్రవర్తించడం సరికాదన్నారు. సోమవారం వీసీ సిహెచ్ అప్పారావు దృష్టికి తీసుకెళ్లగా గురువారం ఫలితాలను విడుదల చేసి అభ్యర్థులకు సకాలంలో ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. దీంతో డిఎస్సి అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించండి : సిపిఎం


గ్రీవెన్స్ డేలో జెసికి వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య లోపాన్ని అరికట్టాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని సోమవారం తిరుపతిలో జరిగిన గ్రీవెన్స్ డేలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తిరుపతి జాయింట్ కలెక్టర్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పుత్తూరు కార్యదర్శి ఆర్.వెంకటేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.సందయ్యలు మాట్లాడుతూ పుత్తూరు మున్సిపాలిటీలో వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పుత్తూరుకమిషనర్ విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని, అందుకు ఈరోజు జెసి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. పారిశుధ్యం లోపంతో వార్డుల్లో దోమలు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల పరిసరాలను కూడా శుభ్రం చేయడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీలో స్మశానాలు ఆక్రమణకు గురయ్యాయని, సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, టిడ్కో ఇండ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పజెప్పాలని కోరారు. జెసి స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో సోమవారం లైన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేఫ్, గూడూరు టౌన్ క్లబ్, గూడూరు వెస్ట్ క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లైన్స్ క్లబ్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన, నూతన కార్యవర్గ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పి.ఎం.జె.ఎఫ్ ఉపేంద్ర మాట్లాడుతూ.. లైన్స్ క్లబ్బుల ద్వారా పేద ప్రజలను ఆదుకునేందుకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ నూతన కార్యవర్గం ముందుకు సాగాలని, సమాజ సేవ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ గోపాలకృష్ణ, ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ పాస్ట్ డిస్ట్రిక్ క్యాబినెట్ సెక్రటరీ శ్రీనివాస్, పి.డి.జి గౌతమ్, డాక్టర్ విరూపాక్ష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాలలో రోటరీ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా క్లబ్ సభ్యులు, విద్యార్థినిలు మొక్కలు నాటారు. అనంతరం అబ్దుల్ కలాం కు నివాళులర్పించారు. రోటరీ క్యాపిటల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ చెట్లు తరిగిపోయి, మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, ముని గిరీష్, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, శ్రీధర్, హనుమంతరావు, గాయత్రి, ప్రశాంతి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టంతో ప్రజాస్వామ్యం బలోపేతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: భారతదేశ ప్రజాస్వామ్యాన్ని సమాచార హక్కు చట్టం బలోపేతం చేస్తుందని డాక్టర్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు చట్టం గురించి అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈసమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ సహ చట్టంతో పారదర్శకత పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడాదికి ఒక్కసారే తిరుమలకు రండి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు శ్రీవారి దర్శనాలకు పలు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే హిందువులకు పుణ్యక్షేత్రం అయిన తిరుమలలో భక్తులు సమర్పించే కానుకలను ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి వినియోగించాలని వెంకయ్య నాయుడు అన్నారు. ప్రభుత్వం రాజకీయ జోక్యం చేసుకోకుండా ఉండాలని, ప్రతి ఊరిలో గుడి కట్టాలని టిటిడి ముందుకు రావాలని కోరారు. గుడి, బడి లేని ఊరు ఉండకూడదని, బడి కట్టించడం ప్రభుత్వ కర్తవ్యమని, దేవస్థానం నిధులు ప్రభుత్వ కార్యక్రమాలకు, ఇతరత్రాలకు ఖర్చు పెట్టకూడదన్నారు. కేవలం దేవాలయం అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు కల్పించడంకు మాత్రమే వినియోగించాలి. ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు ఏడాదిలో ఒకేసారి మాత్రమే దర్శనానికి రావాలన్నారు. వీవీఐపీలు తమవారిని పరిమితంగా దర్శనానికి తీసుకురావాలని, అలాచేస్తే సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉంటుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు.

బంగారు కుటుంబాల ఎంపిక పారదర్శకంగా చేపట్టండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పి4 సర్వే, బంగారు కుటుంబాల ఎంపికలో పారదర్శకంగా, వేగవంతం నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శిల ఎంపిక పై సోమవారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన వారిని, తొలగించిన వారి వివరాలను రికార్డు చేయాలని అన్నారు. బంగారు కుటుంబాల ఎంపికలో ఎక్కడా అవకతవకలు పాల్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. సాయం అందించే మార్గదర్శకులను కూడా ఎంపిక చేయాలని అన్నారు. నగరంలో పారిశుధ్య మెరుగు చేపట్టాలని పారిశుధ్య విభాగ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పన్నులను సకాలంలో వసూలు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

40వ రోజు నిరసన దీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: అక్రమంగా రామారావును వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం నాటికి 40వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రామారావును వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 36 ప్రకారం రాష్ట్రమంతా చెత్త వాహనాల డ్రైవర్లకు జీతం 24,500 రూపాయలు ఇస్తున్నారని, వెంకటగిరి మున్సిపాలిటీలో మాత్రం 21 వేల రూపాయలు మాత్రమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పిఎఫ్ పెండింగ్ బకాయిలు రూ. కోటి 20 లక్షల పైగా పెండింగ్లో ఉన్నాయన్నారు. సమస్యలు పరిష్కరించేయ్యంత వరకు దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య ప్రసాద్ సుబ్రహ్మణ్యం మణి శుభ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి నేత సౌజన్యకు సిఐటియు నేతల పరామర్శ


సౌజన్యను పరామర్శిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శ్రీకాళహస్తి ప్రాజెక్టు నాయకురాలు సౌజన్యకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక బర్డ్ ఆసుపత్రిలోఆమె చికిత్స పొందుతున్నారు. సోమవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేఎస్ఎస్ ప్రసాదరావులు సౌజన్యను పరామర్శించారు.

చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్

భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించిన భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ పనుల విషయమై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పనులకు సంబంధిత ప్రదేశాలలో భూ సేకరణ, రోడ్ల పనులను పూర్తి చేసి అందుబాటులోకి వచ్చే విధంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, నిక్ సిఈఓ నాగభూషణం, అధికారులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంపై సామాజిక మాధ్యమాల్లో

ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు రేంజి పరిధిలోని అటవీ ప్రాంతంపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారిణి మాధవి హెచ్చరించారు. సోమవారం అటవీ శాఖ అధికారులు మాధవి పాత్రికేయులతో మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు అనధికారికంగా ట్రెక్కింగ్ గ్రూప్స్ పేర్లతో డబ్బులు వసూలు చేసి అటవీ ప్రాంతాలలోకి ప్రవేశించి, ఫోటోలు, వీడియోలు తీసుకొని సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటవీ చట్టం 1967 ప్రకారం నేరమని, వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. అడవుల్లో ట్రెక్కింగ్ చేయడం, మత్తు పదార్థాలు తీసుకుని వెళ్ళడం, నిప్పు కల్గించే వస్తువుల్ని తీసుకొని వెళ్లడం, వణ్యప్రాణి సంరక్షణ సంబందించిన ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

టార్గెట్ చేసి అక్రమ నిర్బంధం చేశారు


టికెట్లు చూపుతున్న సిద్ధార్థ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవులలోని ప్రకృతి అందాలను బాహ్య ప్రపంచానికి వెబ్ పేజీ ద్వారా చూపుతున్న తనను టార్గెట్ చేసి పుత్తూరు అటవీ శాఖ కార్యాలయంలో అక్రమ నిర్బంధం చేశారని వైల్డ్ లైఫ్, మైక్రో ఫోటోగ్రాఫర్ ఇనేష్ సిద్ధార్థ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం అటవీ శాఖ నిబంధనల ప్రకారం సదాశివకోన ప్రకృతి అందాలను, జలపాతాలను, దేవాలయాలను సందర్శించాలని స్నేహితులతో, అటవీ శాఖ జారీ చేసే టికెట్టును కొనుక్కుని వెళ్లేమన్నారు. అయితే తిరుగు ప్రయాణంలో నీకు అనుమతి ఇచ్చింది ఈ ప్రదేశం వరకే అంటూ పొంతన లేని ప్రశ్నలను అడిగి పుత్తూరు అటవీ శాఖ కార్యాలయానికి తీసుకెళ్లి రాత్రంతా ఖైదీలా భావించి గదిలో పెట్టి తాళం వేశారన్నారు. దివ్యరామంలో చెట్లు నరికి వేతపై తాను చేసిన వీడియో అప్పట్లో వైరల్‌గా మారడంతోనే తనపై కక్ష పెట్టుకుని అటవీశాఖ అధికారులు ఈ విధంగా ప్రవర్తించారని భావిస్తున్నానన్నారు.

పులివర్తి భారతికి నిమ్మల నివాళి

ప్రజాశక్తి - రామచంద్రాపురం(పాకాల): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాతృ మూర్తి, దివంగత పులివర్తి లక్ష్మీ భారతికి జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం నాని గృహంలో నివాళులర్పించారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి, టిడిపి నాయకురాలు లతా సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 260 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజల అర్జీలకు గడువులోపు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా అధికా రులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు,స్పెషల్ డిప్యూటీ కలెక్ట ర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్, సుధా రాణి, రోజ్ మాండ్‌తో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

తిరుపతి ఐఐటి విస్తరణకు రూ.2,313 కోట్లు

ఇక వేగంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి ఐఐటి అభివద్ధి పై దష్టి కేంద్రీకరించింది.. కేంద్రం నుంచి మరిన్ని నిధులు తెప్పించి విస్తరణ పనులపై దష్టి సారించింది.. మొత్తంగా 2,313.02 కోట్ల రూపాయలను కేంద్రం మంజూరు చేసింది. ఇది ఫిబ్రవరి 2024లో ప్రధాని చేతుల మీదుగా దేశానికి అంకితం చేయటం జరిగిందని. ఇక ఫేజ్-2లో మౌలిక సదుపాయాల విస్తరణ కోసం రూ. 2,313.02 కోట్లు మంజూరైనట్లు లోక్ సభలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.భారతదేశంలో ఉన్నత సాంకేతిక విద్యా సంస్థల అభివద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ నిధులను కేటాయించిందని, 2014 తర్వాత ఏర్పాటైన ఐదు ఐఐటీల విద్యా, మౌలిక సదుపాయాల విస్తరణకు రూ. 11,828.79 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ తెలిపారు. . ఇందులోనే ఆంధ్రప్రదేశ్‌లోని ఐఐటీ తిరుపతి కూడా వుందన్నారు. ఈ ఐఐటీలలో కేంద్రం 130 కొత్త అధ్యాపక పోస్టులను కూడా ఏర్పాటు చేసిందని. ఈ పోస్టులు ప్రొఫెసర్ స్థాయిలో ఐఐటీ తిరుపతి, పాలక్కాడ్, భిలాయ్, జమ్మూ, ధార్వాడ్ వంటి ఐఐటీల్లో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం ఐఐటీ తిరుపతిలో 6 బిటెక్ ప్రోగ్రాములు, 13 ఎమ్.టెక్ కోర్సులు, 3 ఎమ్.ఎస్.సి కోర్సులు, 1 పబ్లిక్ పాలసీ మాస్టర్స్, 9 విభాగాల్లో పి.హెచ్.డి కోర్సులు అందుబాటులో వున్నట్లు తెలిపారు. ఈ సంస్థలో 137 మంది పూర్తి స్థాయి అధ్యాపకులు, 8 మంది అదనపు అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఐఐటీ జోధ్‌పూర్, పట్నా, ఇండోర్‌లకు కూడా హెచ్.ఈ.ఎఫ్.ఎ ద్వారా రూ. 1,942 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం అభినందన



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో తనదైన శైలిలో ప్రదర్శిస్తున్న కమిషనర్ మౌర్యను నగర కమిటి ఆధ్వర్యంలో అభినందించారు. రైల్వేకాలనీ ప్రధానమైన రోడ్డులో రోడ్డును తవ్వేసి వదిలేయడంతో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ విషయమై అప్పట్లో ఆందోళన చేపట్టడంతో కమిషనర్ స్వయంగా పరిశీలించి పరిష్కరించారు. అలాగే ఎఎస్ఆర్ కాలనీలో తెలుగుగంగ నీటిలో డ్రైనేజి కలుస్తుందని ఆందోళన చేపట్టడంతో రెండుసార్లు పర్యటించి రోడ్డు వేశారు. సప్తగిరినగర్ ప్రధానమైన మార్గంలో పైప్‌లైన్ రిపేరు చేశారు. గుంతలు పడిన రోడ్లను మరమ్మతు చేశారు. 34, 43, 44 వార్డుల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తనదైన శైలిలో పరిష్కరిస్తున్న కమిషనర్‌కు 'పుస్తకాన్ని' బహుమతిగా ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, ఎం.నరేంద్ర, ఎం.జయంతి, టి.రామకృష్ణ, లోకేష్, సురేష్ ఉన్నారు.

సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 45 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్ ఉన్నారు

విద్యాపీఠం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) ద్వారా 15 సంవత్సరాలు నిండిన వారు ఒకే సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యను అభ్య సించే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. 15 సంవత్సరాలు నిండి, బడి మానేసి ఉన్నవారు, ఫెయిల్ అయినవారు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా 14 సంవత్సరాలు నిండినవారు ఈ విద్యా విధానం ద్వారా నమోదు చేసుకుని పదవ తరగతి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. కావున నిరుద్యోగులు, టెన్త్ క్లాస్ ఫెయిల్ అయినవారు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చంద్రగిరి పర్యాటక అభివృద్ధికి తోడ్పాటును అందించండి


పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌కు వినతి పత్రం అందిస్తున్న జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి పకృతి వనరులకు పుట్టిల్లని, తలకోన, కళ్యాణి డ్యాం, శ్రీవారిమెట్టు, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురం, రాయలచెరువు, శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి చారిత్రాత్మక కోట వంటి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని చంద్రగిరి జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్ కోరారు. సోమవారం తిరుపతిలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌తో పాటు కలసి వినతిపత్రం అందజేశారు. దేశవిదేశాల నుంచి శ్రీవారి దర్శనానికి భక్తులు వస్తుంటారని, చంద్రగిరి నియోజకవర్గంలో సరైన వసతులు లేక, పర్యాటక ప్రాంతాల సందర్శన చేసుకోలేక వెనుదిరుగుతున్నారని తెలిపారు. తిరుచానూరు అమ్మవారి దర్శనానంతరం రాయలచెరువు, చంద్రగిరి కోట, తలకోన, కళ్యాణి డ్యాం, శ్రీవారిమెట్టు, శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం దర్శించుకునే సౌకర్యాలు కల్పించాలని కోరారు. తలకోనను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించారు. రాయలచెరువు, కళ్యాణి డ్యాంలలో బోటింగ్ ఏర్పాటు పర్యాటకులను ఆకట్టుకుంటాయన్నారు. పర్యాటక అభివృద్ధితో ఆదాయమేకాక, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పర్యాటక అభివృద్ధికి సహకరిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

తిరుపతి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: మంత్రి కందుల

ప్రజాశక్తి - తిరుమల: మంత్రి కందుల దుర్గేష్ సోమవారం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వెంగమాంబ అన్న ప్రసాద సత్రంలో అన్నప్రసాదం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి పరిసర క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. జిల్లా పర్యాటకాభివృద్ధి కోసం ఆగస్టు 7,8 తేదీల్లో తిరుపతిలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా యంత్రాంగంతో పాటు పర్యాటక, దేవాదాయశాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఆగస్టు 1న గండికోట పర్యాటక ప్రాజెక్టు అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని సుదీర్ఘ సముద్రతీరంలో వాటర్ స్పోర్ట్స్, బీచ్ రిసార్ట్స్ ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు. వైజాగ్-చెన్నై మధ్య క్రూజ్ ఏర్పాటుకు ప్రయత్నాలు.. సీప్లేన్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నరని పేర్కొన్నారు.

మంత్రిని సత్కరించిన పసుపులేటి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మంత్రి కందుల దుర్గేష్‌ని రాష్ట్ర హస్తకళ నైపుణ అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ కలంకారీ శాలువతో సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా పసుపులేటి హ్యాండీక్రాఫ్ట్స్ ప్రతి ఒక్క టూరిజం ప్లేస్‌లో టూరిజం హోటల్స్, టూరిజం రిసార్ట్స్‌లో ప్రదర్శించేందుకు మంత్రిని అనుమతి ఇవ్వాల్సిందిగా కోరారు. ప్రతి ఒక్క దేవస్థానంలో టూరిజం రిసార్ట్స్‌లో అరకు, విశాఖపట్నం, గండికోట శ్రీశైలం రిసార్ట్స్ లో లేపాక్షి కౌంటర్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు.మంత్రి సుముఖంగా ఉన్నట్లు తెలియజేశారు.

ఆర్టీసీ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేయండి

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు, ఏపీఎస్ఆర్టీసీ డిపోను సోమవారం ఏపీఎస్ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు సందర్శించారు. ఆయనకు డిపో మేనేజర్, కార్మికులు ఘన స్వాగతం పలికారు. ఆయన కార్మికులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సంస్థ అభివృద్ధికి కార్మికులు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ పర్యటనలో వాకాడు బస్టాండ్ సందర్శించి బస్టాండ్ అభివృద్ధి కొరకు సీసీ రోడ్డు, సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్షణ కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల కాలంలో పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కరువయిందని, పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులే క్రమశిక్షణ పేరుతో గుంజీలు తీయించడం, విద్యార్థులను కొట్టడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఎస్ఎఫ్ఐ తిరుపతి అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవిలు ఒక ప్రకటనలో తెలిపారు. కోట పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలికల వసతి గృహంలో చదువుతున్న విద్యార్థినులను యూనిఫామ్ ధరించలేదని, వారిని కొట్టి, గుంజీలు తీయించారన్నారు. అలాగే చంద్రగిరి మండలం, సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల చేత అక్కడ ఉన్న వర్కర్స్ పని చేయిస్తున్నారని, ఒకవేళ పనిచేయకపోతే తిడుతున్నారని తెలిపారు. కనుక విద్యార్థుల రక్షణ కోసం శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఇలాంటి సంఘటనలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని వీటికి శాశ్వత పరిష్కారం చూపని పక్షంలో విద్యార్థులతో తీవ్రమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పీహెచ్‌డీ ఫీజు తగ్గించాలి



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో ఇటీవల పీహెచ్‌డీ సబ్మిషన్ ఫీజును రూ. 9,339 నుండి రూ.15,000కి పెంచిన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని వివిధ విభాగాల పరిశోధక విద్యార్థులు ఇంచార్జి ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకి సోమవారం వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో కన్వీనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ మూడు నెలల ముందు పీహెచ్డీ సబ్మిషన్ ఫీజుని 66 శాతం పెంచారని, ఫీజు పెంచిన విషయం పరిశోధక విద్యార్థులకు తెలియచేయకుండా గోప్యంగా ఉంచడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. కొందరు పరిశోధకులు మాట్లాడుతూ వైవాకి ఎక్స్‌టర్నల్స్ సంతకం చేయాలంటే వేల రూపాయలు లంచం అడుగుతున్నారని, ప్రయాణానికి ఫ్లైట్ టికెట్స్ బుక్ చెయ్యాలని, ఫైవ్ స్టార్ హోటల్స్‌లో వసతి, కార్లు, భోజనాలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇంచార్జి వీసీ అప్పారావు స్పందిస్తూ ఫీజు తగ్గించేవిదంగా కృషి చేస్తానని, వైవాలకు ఎవరైనా డబ్బులు అడిగితే మా దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు శ్రీనివాస్, సాయి, శ్రీకాంత్, మనోజ్, శివ, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి హాస్టల్లో ఉంటున్న ఓ యువతి కనపడకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు నింద్ర మండలం, చౌరం గ్రామానికి చెందిన చిన్నబ్బ కుమార్తె నాగమణి (20), రేణిగుంటలోని సెల్కాన్ కంపెనీలో విధులు నిర్వహిస్తూ, ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్వీ నగర్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటోంది. ఆదివారం నుంచి యువతి కల్పించ లేదని తెలియడంతో తండ్రి తిరుపతికి చేరుకొని, చుట్టుపక్కల గాలించారు. ఫలితం లేక, ఎస్వీ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన యువతి కోసం గాలింపు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొర్లగుంటలో నివాసముంటున్న లక్ష్మీదేవి దంపతుల కుమార్తె శివసాహిత్య (22) ఆదివారం ఇంటి నుండి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఆమె ఆచూకీ దొరకపోవడంతో ఈస్ట్ పోలీసులు ఆశ్రయించి, పిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


మృతి చెందిన ఎరికలరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గుండెపోటుతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి పద్మావతి పురంలోని శ్రీపాద సాయి రెసిడెన్సులో నివాసముంటున్న ఎరికలరెడ్డి (54) తిరుపతి రైల్వే జిఆర్‌పిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి తిరుపతి రైల్వే స్టేషన్లో నైట్ డ్యూటీకి వెళ్ళిన ఆయన, సోమవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో ఫ్లాట్ ఫామ్ పై విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయారు. తోటి ఉద్యోగులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాకు తరలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రైలు నుండి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానిక రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల మేరకు, సోమవారం షాలిమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తుతెలియని వ్యక్తి జారి రైలు భోగిల కింద పడిపోవడంతో గుర్తుపట్టలేని విధంగా నుజ్జు నుజ్జుయి మృతి చెందాడు. దీనిని గుర్తించిన రైల్వే గ్యాంగ్ సిబ్బంది, సూళ్లూరుపేట జిఆర్పి పోలీసులకు సమాచారం అందించారు. జి ఆర్ పి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి


మృతి చెందిన కృష్ణయ్య


ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యుత్ షాక్‌కు గురైన కార్మికుడు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు విజయపురం మండలం మిట్టకండ్రికి చెందిన కృష్ణయ్య (60) కపిలతీర్థం సమీపంలోని ఓ ప్రైవేటు కారు వాషింగ్ నిర్మాణంలో ఉన్న షాపులో కూలి పనికి వచ్చాడు. ఆదివారం కూలి పని విధుల్లో నిర్వహిస్తున్న కార్మికుడు కృష్ణయ్య ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురయ్యాడు. స్థానికులు ఆయనను హుటాహుటిన రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రులో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. మృతుడి కుమారుడు డేగ రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య




ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) : చంద్రగిరి మండలం, శ్రీనివాస మంగాపురం రైల్వే గేటు సమీపంలోని అటవీ శాఖ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీనివాస మంగాపురం రైల్వే గేటు సమీపంలోని అటవీ ప్రాంతంలో మృతుడు 20 అడుగుల ఎత్తులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉండటాన్ని సోమవారం స్థానిక పశువుల కాపర్లు చూశారు. దుర్వాసన రావడంతో ఆ విషయాన్ని చంద్రగిరి పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. దాదాపు పది రోజులు పైగా కావడంతో మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉందని తెలిపారు. ఘటనా స్థలంలో మద్యం బాటిళ్ళు ఉన్నట్లు గుర్తించారు. మృతుడు 35-40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా? హత్య చేసి చెట్టుకు వేలాడదీశారా? అన్న కోణంలో చంద్రగిరి ఎస్సై అనిత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో ప్రమోషన్ల గొడవ.. ఇద్దరి మధ్య ఘర్షణ


గాయాల పాలైన శ్రీనివాసరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, యస్వీయు, ఇంజనీరింగ్ విభాగంలో శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా ఇరువురు మధ్య ప్రమోషన్ విషయంలో, ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్థలు ఉన్నాయి. ఐతే సోమవారం శ్రీనివాసరావు యూని వర్సిటీలో బోధనేతర సంఘం సమావేశానికి వెళ్లి తిరిగి వస్తుండగా, కార్యాలయం ఆవరణ బయట చెట్టు కింద ఉన్న సుబ్రహ్మణ్యం తనకు డబ్బులు ఇవ్వవలసిందిగా నిలదీయడంతో, ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అదును చూసుకొని సుబ్రహ్మణ్యం శ్రీనివాసరావును రాయితీసి కొట్టడంతో తలకు తీవ్రంగా గాయమైంది. దీంతో శ్రీనివాసరావు ఎస్వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో శ్రీనివాసరావు ఫిర్యాదు చేసి, రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనకు రావలసిన డబ్బులు అడిగితే శ్రీనివాస్ రావే తనపై దాడి చేశారని సుబ్రహ్మణ్యం తెలిపారు.

వ్యవసాయ బావిలో మృత దేహం



మృతుడు గజేంద్రన్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - నాగలాపురం: వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగలాపురం మండలం కృష్ణాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల మేరకు కృష్ణాపురం గ్రామానికి చెందిన తిప్పారెడ్డి వెంకటేశ్వరరావు పొలం బావిలో దుర్వాసన రావడంతో గుర్తించి, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచార అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు వెలికి తీశారు. మృతి చెందిన వ్యక్తి నాగలాపురం పొట్టి నాయుడు వీధికి చెందిన గజేంద్రన్ (60) గా గుర్తించారు. గజేంద్ర మృతి చెంది సుమారు నాలుగు రోజులు అయిఉంటుందని తెలిపారు. గజేంద్రన్ తల్లి యశోదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, మంగళం రూరల్స్ సెక్షన్, నార్త్ సెక్షన్, అవిలాల సెక్షన్ 33/11 కె వి వాటర్ వర్క్స్ ఫీడర్, పాలిటెక్నిక్ ఫీడర్ కెసి పేటలో దుర్గ సముద్రం ఫీడర్లు విద్యుత్ మరమ్మత్తులు కారణంగా 29వ తేదీ మంగళవారం ఉదయం 09 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తిరుపతి ఆపరేషన్ టౌన్ డివిజన్ ఏపిఎస్పిడిసిఎల్ విద్యుత్ ఈఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. కె. సి పేట, దుర్గ సముద్రం, వడ్డీ పల్లి, ఎ. డి. ఆర్ పల్లి, భాగ్య నగరం, కుంట్రా పాకం, ఎస్. టి. ఎన్ పల్లి, కె. సి పేట, చిగురువడ, పి. ఎస్. ఎన్ గార్డెన్స్, కె. బి. ఆర్ నగర్, ఎస్. వి. ఇంజనీరింగ్ కాలేజీ, గంగ దేవి కాలనీ, వరద రాజ నగర్, కె. టి. రోడ్డు తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులు విద్యుత్ అంతరాయం గమనించి సహకరించాలని కోరారు.

మందు బాబులకు కౌన్సెలింగ్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో, వడమాల పేట మండల కేంద్రంలోని కొన్ని ప్రాంతాలలో మందు బాబులకు ఎస్సై ధర్మారెడ్డి సోమవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. శ్రీనివాస గార్డెన్లో మద్యం సేవించిన అనంతరం విచ్చలవిడిగా పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుద్ధ కార్మికులచే శుభ్రం చేయించారు.

పోషకాహారంతోనే ఎదుగుదల

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:నవ భారత్ సేవా సమాజ్ సంస్థ వారు తిరుపతి అంబేద్కర్ కాలనీలోని తమ శిక్షణా కేంద్రంలో సోమవారం మహిళలకు పిల్లల పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్లోని పీడియాట్రిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శశి కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నవ భారత్ సేవా సమాజ్ సిబ్బంది లావణ్య, సులోచన, ద్రాక్షాయిణి, సాయి ప్రియ, రజిత శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

పాంచాలి నగర్‌లో పారిశుధ్య నిర్వహణ

ప్రజాశక్తి - రేణిగుంట: పబ్లిక్ హెల్త్ పై శ్రద్ధ చూపిస్తూ రేణిగుంట పోలీసులు వినూత్నంగా ముందుకు వచ్చారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ జయచంద్ర, ఎస్సై అరుణ్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాంచాలి నగర్ ప్రాంతంలో సోమవారం ఓపెన్ బూజింగ్ స్థలాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు స్థానిక పంచాయతీ సిబ్బందితో కలిసి స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలకు చైతన్యం కలిగించే ఉద్దేశంతో పాల్గొన్నారు. మలిన ప్రాంతాలు ప్రజారోగ్యానికి హానికరం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన కలిగించింది. రేణిగుంట పోలీసుల ప్రయత్నాన్ని స్థానికులు అభినందించారు.

మెరైన్ పోలీసువారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం



ప్రజాశక్తి - వాకాడు : వాకాడు మండలం, చిన్న తోట పిహెచ్‌సిలో సోమవారం శ్రీహరికోట మెరైన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మాలకొండయ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెరైన్ డిఐజి ఆదేశాల మేరకు, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విశాఖపట్నం వారి ఉత్తర్వులు నిర్వహించినట్లు మాలకొండయ్య తెలిపారు. తీరప్రాంతాల్లోని మత్స్యకారులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వనిత, ఉదయ్, శ్రీహరికోట మెరైన్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది, గ్రామ పెద్దలు ప్రధాని చిన్న భయ్యా, చిత్తాడి హనుమంత రెడ్డి, పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు : సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య ఆధ్వర్యంలో డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా ఏర్పేడు మండలం, మర్రిమంద ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంకటయ్య మాట్లాడుతూ దోమలు కుట్టకుండా, వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీలో హెల్త్ సూపర్వైజర్ మంజుల, పంచాయతీ కార్యదర్శి మురగయ్య, ఎమ్ఎల్‌హెచ్‌పి, ఆశా వర్కర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :రూరల్ మండలం, తిరుమలకుప్పం గ్రామపంచాయతీలో సోమవారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు, పుత్తూరు రూరల్ మండల క్లస్టర్ ఇంఛార్జి గంజి మాధవయ్య ఆధ్వర్యంలో, తిరుమలకుప్పం గ్రామపంచాయతీ బూత్ నంబరు 93, రాజులకండ్రిగ ఎస్టీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేసి అభివృద్ధిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అరవ బాలాజీ, హేమంత్, బూత్ ఇంఛార్జి ఈశ్వర్ ప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏర్పేడు మండలం, ఎండి పుత్తూరు పంచాయతీలో టిడిపి నేతలు పర్యటించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పేరం ధనంజయల నాయుడు, నైనారు పున్నారావు, మోహన్ నాయుడు, బాబు నాయుడు తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :నేటితరం విద్యార్థినిలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్ సూచించారు. స్థానిక కాసాగార్డెన్ బాలికల ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం బాలికల చైతన్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియాకు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని వివరించారు. ఆ రెండింటినీ మంచి కోసం మాత్రమే వినియోగించాలని సూచించారు. చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. వేధింపులకు గురయ్యే క్రమంలో ముందస్తుగా తల్లిదండ్రులకు, తదుపరి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాధవీ లత, ఎస్ఐలు పార్థసారథి, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో అరంగేట్రం



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) అమెరికా కాలమానం ప్రకారం ఈ నెల జులై 26 వ తేదీ శనివారం న్యూజెర్సీలో కుమారి లెక్కల సంజన కూచిపూడి నాట్య ప్రదర్శన ఆరంగేట్రం చేసింది. అమెరికాలోని సిద్ధేంద్ర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వారి సౌజన్యం తో ఈ ప్రదర్శన జరిగింది. తిరుపతికి చెందిన లెక్కల కృష్ణ దంపతులు 15 సంవత్సరాల క్రితం అమెరికాకు వెళ్లి స్థిరపడ్డారు. తెలుగు సాంప్రదాయం మీద ఉన్న గౌరవంతో న్యూ జెర్సీ లోని స్వాతి అట్లూరి అనే నాట్య గురువు వద్ద తమ కుమార్తె సంజనకు శిక్షణ ఇప్పించారు. సంజన చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శన దాదాపు 4 గంటల పాటు సాగింది.

బ్లెకింగే ఇన్‌స్టిట్యూట్‌తో ఎస్పిఎమ్విలి ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ :శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.ఉమ, స్వీడన్‌కు చెందిన బ్లెకింగే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటిఎచ్) అంతర్జాతీయ డైరెక్టర్ గురుదత్ వెల్పులా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఇ)లో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రాం పునరుద్ధరణ ఒప్పందం కుదుర్చుకున్నారు. బీటెక్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రాం నిర్వహించేందుకు 2018లో రెండు విశ్వవిద్యాలయాలు మొదటగా ఒప్పందం చేసుకున్నాయి. అదనంగా, ప్రొఫెసర్ ఉమ , గురుదత్ వెల్పులా పలు విద్యా సహకార అంశాలపై చర్చించారు. ఇందులో అధ్యాపకుల మార్పిడి, అక్టోబర్‌లో భారత్‌కు బీటిఎచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హెన్రిక్ జాన్సన్ సందర్శన వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, డీన్ ప్రొఫెసర్ పి.విజయలక్ష్మి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఆర్.ఉష పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): దాతలు అందించే అవకాశాలతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి సింగు సుధా పేర్కొన్నారు. చంద్రగిరి మండలంలోని కొటాల మోడల్ ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులకు ఏకం యూఎస్ఏ వారి ఆర్థిక సహకారంతో సోషియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగు సుధ విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటాల గ్రామపంచాయతీ టీడీపీ గ్రామ అధ్యక్షులు విష్ణు, వార్డ్ మెంబర్ మల్లికమ్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులను తరలించండి

శిథిలావస్థలో కళాశాల భవనం




ప్రజాశక్తి - సత్యవేడు: ప్రమాదకర తెలుగుగంగ భవనంనుండి ప్రభుత్వ డిగ్రి కళాశాల విద్యార్థులను వేరే భవనానికి వెంటనే తరలించాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పృథ్వి డిమాండ్ చేశారు. సోమవారం టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పృథ్వి బృందంతో కలిసి సత్యవేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించారు. ఈ నేపధ్యంలో ఆయన మాట్లాడుతు డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న తెలుగు గంగ భవనంలోని ప్రతి గది పెచ్చులుడి ఇనుప చువ్వల కనిపించేలా శిథిలావస్థలో విద్యార్థులకు ప్రమాదాన్ని కలిగించేలా ఉందన్నారు. వసతులు కూడా అంతంత మాత్రంగా ఉన్నాయన్నారు. వెంటనే ఇక్కడ విద్యార్థులను వేరే భవనానికి బదిలీ చేయకుంటే విద్యార్థులు ప్రమాదాల బారిన పడతారని హెచ్చరించారు. త్వరలో కళాశాల సమస్యలపై టిడిపి సత్యవేడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డిని కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్‌యు యూనిట్ ఇంచార్జ్ దిలీప్, చేనేరి భూతి ఇంచార్జ్ ముద్దుకృష్ణ, బాబి, దయ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన బొజ్జల బృందమ్మ

ప్రజాశక్తి - తొట్టంబేడు: ప్రతి ఒక్క కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తెలుగుదేశం పార్టీ యొక్క ప్రధాన లక్ష్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ పేర్కొన్నారు. మండలంలోని చియ్యవరం పంచాయతీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బొజ్జల బృందమ్మ విచ్చేశారు. మొదటగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు, గాలి మురళి నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాసానికి సన్మానం



ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యునిగా నూతనంగా నియామకమైన డాక్టర్ రాసాని వెంకటరామయ్యను సోమవారం ఘనంగా సన్మానించారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ వెంకట్రామయ్య నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పత్తిపాటి వివేక్, డాక్టర్ వినోద్ కుమార్ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ ఎస్వీయూ అధ్యక్షుడు వెంకటేష్ నాయుడు, గంగాధరం, రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం 24 మంది లబ్దిదారులకు సీఎం సహాయ నిధి నుండి మంజూరైన 19లక్షల 66వేల, 26 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఒక కోటి 50 లక్షల రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య, పులిమీ శ్రీనివాసులు, కిషోర్ నాయుడు, భాస్కర్ రెడ్డి, మట్టం శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్లు అందజేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ప్రభుత్వం అందించిన డ్రోన్‌ను సోమవారం చిల్లకూరు మండలం రైతుకు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేసుకొని ఆదాయం పొందేందుకు కూటమి ప్రభుత్వం వీటిని అందిస్తుందని, పొలంలో మందులను పిచికారి చేసుకునేందుకు డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు టార్పాలిన్ పట్టాలు కూడా ఇవ్వలేదని రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో త్వరలో మరికొన్ని డ్రోన్లను అందిస్తామని త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, వినోద్ కుమార్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు సరైన మోతాదులో వాడాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సరైన మోతాదులో ఎరువుల వాడకం క్షేమకరమని, జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు తెలిపారు. సోమవారం నారాయణవనం మండలం, సముదాయం గ్రామంలో పీఎంఆర్కేవివై పథకం కింద, తిరుపతి జిల్లా వనరుల కేంద్రం వారిచే రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేణుగోపాలరావు మాట్లాడుతూ అధిక ఎరువుల వాడకం ఆరోగ్యానికి నష్టమని, సాగు ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకం శ్రేష్టమని తెలియజేశారు. నారాయణవరం మండలం వ్యవసాయ అధికారి శోభ, వ్యవసాయ శాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సముదాయం గ్రామ వ్యవసాయ సహాయకురాలు రమ్య, జిల్లా వనరుల కేంద్రం ఏంఈఓ రవిచంద్ర, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాశక్తి - పిచ్చాటూ రు:మహిళల అభ్యున్న తే లక్ష్యంగా రాష్ట్ర ప్ర భుత్వం పని చేస్తుం దని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొ న్నారు. సోమవారం పిచ్చాటూరు వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాలకు రూ.1.72 కోట్ల శ్రీనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శివ కుమార్, ఎంఈఓ హేమమాలిని, ఏపీఎం చంద్ర కళ, క్లస్టర్ ఇన్చార్జ్ బాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.